క్లుప్తంగా

కొలతల ప్రకారం బిల్లులు

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు కూలీలకు కొల తల ప్రకారమే బిల్లులు చెల్లింపులు ఉంటాయని ఏపీఓ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందికి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 23 గ్రామ పంచాయతీల పరిధిలోని 14 గ్రామ వార్డు సచివాలయ పరిధిలో 6200 మంది కూలీలు పని చేస్తున్నారు. టీఏలు వెంకటేశ్వర్లు, వెంకట్రావు, రజిని, వెంకటరెడ్డి, తదితరులున్నారు.

రీసర్వే వేగవంతం చేయండి

హనుమంతునిపాడు: భూముల రీసర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎస్.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటల్లో తెలిపారు. ఆయన మాట్లాడుతూ 10 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే ముమ్మరంగా జరుగుతోందని.. కొత్తగా హాజీపురం గ్రామం కూడా నేటి నుంచి రీసర్వే మొదలు పెడతారన్నారు.

ఘనంగా కృపాదీవెన పండుగలు

సీఎస్‌పురం (పీసీపల్లి): డీజీపేటలో యేసుక్రీస్తు కృపాదీవెను పండగలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 17 నుంచి శుక్రవారం వరకు డీజీపేట లోని తెలుగు బాప్టిస్టు చర్చి ఆవరణలో యేసుక్రీస్తు కృపా దీవెన పండగలు నిర్వహించారు. ఊటుకూరి దేవదానం, శాంత కుమారి, సంఘ కాపరి రెవ నేరెళ్ల జగన్, జాన్ వెస్లీ, హనోకు దైవ సందేశం అందించారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల నియామకం

సీఎస్‌పురం (పీసీపల్లి): మండలంలోని 26 గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల నియామకం చేపట్టినట్లు ఎమ్మెస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జె.పి రాజు మాదిగ తెలిపారు. ఏకునాంపురం, చెర్లోపల్లి, అరివేముల, ముండ్లపాడులో శుక్రవారం మహాజననేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మిషన్ 50 డేస్- గో టు విలేజ్ కార్యక్రమంలో భాగంగా ఈ నియామకం చేపట్టినట్లు చెప్పారు. అధ్యక్షులుగా చెంచయ్య, పోలయ్య, వెంకటయ్య, అంగలకుర్తి ఇమ్మానియేలు, ఎడ్ల మోషేలను ఎన్నుకున్నట్లు తెలిపారు. బలభద్ర రవి, నాయకులు పాల్గొన్నారు.

నలుగురు జూదరులు అరెస్టు

మర్రిపూడి: పేకాట శిబిరంపై పొదిలి ఎస్ఈబీ పోలీసులు శుక్రవారం రాత్రి ఆకస్మికంగా దాడి చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన మండలంలోని గుండ్లసముద్రం గ్రామశివారులో చోటుచేసుకుంది. నిందితుల నుంచి రూ.4250 స్వాధీనం చేసుకున్నట్లు పొదిలి సర్కిల్ ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే ఖాజా మొహిద్దీన్ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు మర్రిపూడిలో రక్తదాన శిబిరం

మర్రిపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు గురిజాల యేబు తెలిపారు. స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని పీడీసీసీబీ చైర్మన్ మాదాసి వెంకయ్య ప్రారంభిస్తారని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ మాదాసి వెంకయ్య రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

- సీఐ దాచేపల్లి రంగనాథ్

జరుగుమల్లి(సింగరాయకొండ): ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ దాచేపల్లి రంగనాథ్ హెచ్చరించారు. జరుగుమల్లి మండలంలోని అనధికార ఇసుక రీచ్‌లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సీఐ రంగనాథ్ మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు మండలంలోని ప్రధాన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రాక్టరును సీజ్ చేసి కేసు నమోదు చేశారు. జరుగుమల్లి ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయండి



గ్రామ సచివాలయ సిబ్బందికి సూచన ఇస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

జరుగుమల్లి(సింగరాయకొండ): గృహ నిర్మాణ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ పి. రామకృష్ణ పేర్కొన్నారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాలేటిపాడు గ్రామ సచివాలయంలో జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఐరన్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. బిల్లులు కూడా వెంటనే చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. హౌసింగ్ డీఈ పి.జయరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కొండంత అండ

- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలింకో, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం
- శిబిరానికి భారీగా తరలివచ్చిన దివ్యాంగులు
- పర్యవేక్షించిన ఎమ్మెల్యే మానుగుంట



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, డీఎస్పీ

కందుకూరు: వికలాంగులకు అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలింకో ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వికలాంగులకు, చెవుడు, మూగ, కంటి సమస్యలు వంటి వైకల్యాలు వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన ఉపకరణాలు అందిస్తామని చెప్పారు. ఈ శిబిరాన్ని సబ్ కలెక్టర్ శోభికతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ శిబిరాన్ని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాటరీతో నడిచే సైకిళ్లను కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ, ఎంపీ నిధులతో ఉచితంగా అందిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల చట్టం- 2007 ప్రకారం వారి సంరక్షణ బాధ్యతలను కుమారులు, కుమార్తెలు చూడాల్సిన బాధ్యత అని చెప్పారు. వృద్ధాప్యంలో ఉన్న వారికి ఏమైనా సంరక్షణ సమస్యలు ఉంటే 14567 అనే టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

రోజంతా శిబిరం వద్దే..

ఈ శిబిరానికి ముందుగానే ప్రచారం కల్పించడంతో వికలాంగుల నుంచి భారీ స్పందన వచ్చింది. డివిజన్ స్థాయిలో జరిగిన శిబిరానికి దాదాపు 700 మంది వికలాంగులు తరలివచ్చారు. ఎండల తీవ్రతను గమనించిన ఎమ్మెల్యే వారికి ఏలోటు రాకుండా అప్రమత్తమయ్యారు. వారికి వీల్‌చైర్‌లు వంటి ఇతర సౌకర్యాలను తన నిధులతో ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన పర్యవేక్షించారు. ఎమ్మెల్యే అందించిన సేవల పట్ల ప్రశంసలు వెల్లువెత్తాయి. జిల్లా వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ అక్బర్ అలీ, డీఎస్పీ రామచంద్ర, సీఐ వెంకట్రావ్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఎంపీడీఓ విజయశేఖర్, ఎస్సైలు హనీఫ్, శివనాంచారయ్య, హెల్పేజ్ ఇండియా కన్వీనర్ జాన్‌బాబు పాల్గొన్నారు.



శిబిరానికి హాజరైన దివ్యాంగులు

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

పామూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేదిలేదని జేసీ కె.శ్రీనివాసులు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జీరో ఖాతాలు ఎక్కువగా ఉండటాన్ని గమనించి సమస్య పరిష్కరించాలన్నారు. రీసర్వేపై ఆరా తీశారు. దూబగుంట్ల పంచాయతీలో నివేశనాస్థల పట్టాలు రాలేదని వీఆర్వో ఆయన దృష్టికి తేగా ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. నర్రమారెళ్ల గ్రామానికి చెందిన రైతులు.. తమ గ్రామంలో టీడీపీ నాయకుడు గుంటుపల్లె శ్రీనివాసులు, మరికొందరు అక్రమంగా పట్టాలు పొందారని దీనిని రద్దుచేసి పేదలకు ఇవ్వాలని కోరగా తక్షణం వాటిని రద్దు చేయాలని ఆర్డీవో, తహసీల్దార్‌కు సూచించారు. కనిగిరి ఆర్డీవో తోట అజయ్‌కుమార్, తహసీల్దార్ జ్వాలా నరసింహం, డీటీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ నరగా ప్రవీణ్, సురేష్, వీఆర్వోలు పాల్గొన్నారు. ముందుగా జేసీ శ్రీనివాసులు, ఆర్డీవో తోట అజయ్‌కుమార్‌లను ఎంపీపీ గంగసాని లక్ష్మి, నాయకులు సిద్ధమూర్తి నారాయణరెడ్డి, గంగసాని హుసేన్‌రెడ్డి, కోఆప్షన్ నాయబ్‌రసూల్, గట్లా విజయబాస్కర్‌రెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, సిద్ధమూర్తి లక్ష్మీనారాయణరెడ్డి, బాలాంజనేయులురెడ్డిలను సన్మానించారు.

స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యం



ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రసేన్

గుడ్లూరు: ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా స్వచ్ఛమైన మంచినీటిని అందించడమే జలజీవన్ మిషన్ పథకం లక్ష్యమని ఎంపీపీ పులి రమేష్, ఎంపీడీఓ చంద్రసేన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రేరణ ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ మంచినీటి పథకాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులుకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా కలుషితం లేని స్వచ్ఛమైన మంచినీళ్ళు అందించాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు జలజీవన్ మిషన్ పథకం కింద వాటర్ ట్యాంకులు కట్టి పైపులు వేసి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజశేఖర్ మాట్లాడుతూ మంచినీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలన్నారు. క్లోరినేషన్ ద్వారా వ్యాధులను నివారించవచ్చు అని చెప్పారు. జిల్లా రిసోర్స్ పర్సన్ లవ్‌కుమార్ మాట్లాడుతూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు నిరంతరం మంచి పథకాలను పర్యవేక్షణ చేయాలన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



సీఎస్‌పురం: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



పామూరు: నివాళులర్పిస్తున్న నాయకులు

వలేటివారిపాలెం: దక్షిణ భారత కమూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సీఐటీయూ అధ్వర్యంలో పోకూరు సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. సీఐటీయూ జెండాను జిల్లా కమిటీ సభ్యులు సరస్వతి ఆవిష్కరించారు. సుందరయ్య చిత్రపటానికి కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు మాధవమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జీవీబీ కుమార్ మాట్లాడుతూ సుందరయ్య సంపన్న కుటుంబంలో పుట్టినప్పటికీ తాను జీవితాంతం పీడిత ప్రజల విముక్తి కోసం కృషి చేశారని కొనియాడారు. తన గ్రామం నుంచే అంటరానితనం పోవాలని కూలి, శ్రమ దోపిడీ అంతం కావాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించి కార్మిక, కర్షక మైత్రి కోసం అనేక పోరాటాలు చేశారని చెప్పుకొచ్చారు. సుందరయ్య ఆశయాలు ఇంకా నెరవేరలేదని, ఆయన ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వూరి జాన్, మండల కార్యదర్శి భాస్కర్‌రావు, లక్ష్మి, రాజ్యం, పంచాయతీ ఉద్యోగులు అబ్దుల్ బరీ, ధనలక్ష్మి, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సుందరయ్య

పామూరు: కామ్రేడ్ సుందరయ్య పేదల పక్షపాతి అని సీపీఎం మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి పేర్కొన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సభ శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సీనియర్ నాయకులు షేక్ అల్లాభక్షు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు సామ్రాజ్యవాదాన్ని నలుదిక్కులా వ్యాపింప చేసేందుకు సుందరయ్య చేసిన కృషి ఎనలేనిదన్నారు. శంకర్, గౌసా, వెంకటేశ్వర్లు, ఖాసీం సాహెబ్, భానుమతి, బత్తుల పరిమళాదేవి, నాయబా, రామయ్య, మాధవ్, క్రిష్ణ, మస్తాన్, పలువురు సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పీసీపల్లి): పేదల పాలిట పెన్నిధి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం చిత్ర పటానికి నివాళులర్పించారు. మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఎస్. తిరుపతిరెడ్డి, బి. జేసురత్నం, గుర్రం లక్ష్మయ్య, అంకేపల్లి వెంకటేశ్వర్లు, కరిముల్లా, కొండయ్య, ఆంథోని పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లు సేవా వారధులు



ఉత్తమ ప్రతిభ కనబరచిన వలంటీర్లకు పతకాలు అందజేస్తున్న వరికూటి

- వరికూటి అశోక్‌బాబు

కొండపి(సింగరాయకొండ): గ్రామ వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు సేవా వారధిలా పనిచేస్తూ సంక్షేమానికి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. కొండపి మండలం పెట్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. పెట్లూరు, చిన్నకల్లకుంట, మూగచింతల గ్రామ వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వరికూటి మాట్లాడుతూ.. గ్రామ వలంటీర్లు ఒకటో తేదీన ఇంటింటికీకి వెళ్లి అవ్వాతాతలకు పింఛన్లు అందించి వారి మన్ననలు పొందుతున్నారన్నారు. విపత్తుల సమయంలో, అలాగే అర్హులకు పథకాలు అందించేందుకు వలంటీర్లు కృషి చేస్తుంటే చంద్రబాబునాయుడు మాత్రం గ్రామ వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తానంటున్నారని విమర్శించారు. ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, హౌసింగ్ ఏఈ భూపతి రాజు, ఎంపీటీసీ ఎ.కోటిరత్నం, నూర్జహాన్, సర్పంచ్ ఎ.ఝాన్సీరాణి, పి.సూర్యనారాయణ, షేక్ వన్నూరు పాల్గొన్నారు.

1494 బేళ్లు కొనుగోలు

కందుకూరు: వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన వేలంలో కందుకూరు ఒకటో వేలం కేంద్రంలో 760 బేళ్లు వేలానికి ఉంచగా 700 బేళ్లు, రెండో వేలం కేంద్రంలో 870 బేళ్లు ఉంచగా 794 బేళ్లు కలిపి మొత్తం 1494బేళ్లు రెండు వేలం కేంద్రాల్లో అమ్ముడుపోయాయి. రెండు వేలం కేంద్రాల్లో గరిష్ట ధర రూ. 200 లభించగా, కనిష్ట ధరలు వరుసగా రూ. 160లు, రూ. 150లు వచ్చాయి.

టీఆర్ఆర్ డిగ్రీ కళాశాలకు న్యాక్ బి++ గ్రేడ్ గుర్తింపు

కందుకూరు రూరల్: పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బి ++గ్రేడ్ గుర్తింపును బెంగళూరు నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ వారు ప్రకటించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 4,5 తేదీల్లో ముగ్గురు సభ్యుల న్యాక్ పీర్ టీమ్ బృందం కళాశాలను సందర్శించి వివిధ క్వాలిటీ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. కళాశాల భవిష్యత్‌లో స్వయం ప్రతిపత్తి హోదా సాధించి, రీసెర్చ్ రంగంలో నిధులు, ప్రాజెక్టులు సాధించడంలో ఈ న్యాక్ గ్రేడింగ్ ఉపకరిస్తుందన్నారు.

వడదెబ్బతో జాగ్రత్త

లింగసముద్రం: వేసవికాలంలో ఎండలు ఎక్కువ కాస్తున్నందున వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డా.రమేష్ చెప్పారు. శుక్రవారం ముత్యాలపాడు సచివాలయం పరిధిలోని ముత్తంవారిపాలెంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. హిమోగ్లోబిన్ శాతం పరిశీలించి ఐరన్, ఫోలిక్‌యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ జి. శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



శంకుస్థాపనలో చైర్మన్ గఫార్, కౌన్సిలర్ రాజీవ్

కనిగిరి రూరల్: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. 7వ వార్డులోని నార్లపాటి వారి వీధిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు శుక్రవారం చైర్మన్ గఫార్, కౌన్సిలర్ దేవకి రాజీవ్‌లు శంకుస్థాపన చేశారు. కౌన్సిలర్ దేవకి రాజీవ్, కౌన్సిలర్లు వేల్పుల వెంకటేశ్వర్లు, ఎస్‌కే ఖాశింసా, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, రామనబోయిన శ్రీనివాసులు, టి. తిరుపతయ్య, గోవిందరావు, వలేటీ సుబ్బారావు, కొటా కొండలు, సందాని, డాక్టర్ రసూల్, కిషోర్ పాల్గొన్నారు.

డీసీపీ పవన్ కుమార్‌రెడ్డికి సత్కారం



డీసీపీ పవన్ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: చెన్నై డీసీపీ అల్లాటిపల్లి పవన్ కుమార్‌రెడ్డిని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం డీసీపీని చైర్మన్ గఫార్ మర్యాద పూర్వకంగా కలిశారు. కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పసుపు లేటి అరుణోధర్, దాసరి మురళీకృష్ణా, వాలిచర్ల వెంకటేశ్వర్లు, బాబురావు, బొట్టు శ్రీను, పులి శ్రీను, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంఎస్ఎం కళాశాల తరపున డీసీపీని సన్మానించారు.

రైతులకు మద్దతు ధర అందించాలి

టంగుటూరు: రైతులకు మద్దతు ధర అందించాలని పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక వేలం కేంద్రంలో చూర, పండుగుల్ల అమ్మకాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. వేలం కేంద్రం పరిధిలోని రైతులు పండుగుళ్ల బేళ్లు 23 తీసుకురాగా 11 కొనుగోలయ్యాయి. సరాసరి ధర కేజీ రూ.72.90 పలికింది. అలాగే పొగాకు చూర బేళ్లు 1126 తీసుకురాగా 1075 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.181, కనిష్ట ధర రూ.65, సరాసరి ధర రూ.125.25 పలికింది. వేలంలో మొత్తం 16 మంది వ్యాపారులు పాల్గొన్నారు. బోర్డు సభ్యుడు వరప్రసాద్, ఎస్జీఓ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



వేలాన్ని పరిశీలిస్తున్న బోర్డు ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు

కార్మికులకు మజ్జిగ అందించాలి

- కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్‌కుమార్ సూచన



కార్మికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న కార్మికశాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్‌కుమార్

సింగరాయకొండ: వేసవిలో ఎండ తీవ్రతను తట్టుకోవడానికి ప్రతి ఫ్యాక్టరీలో కార్మికులకు మజ్జిగ అందజేయాలని గుంటూరు కార్మికశాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్‌కుమార్ సూచించారు. స్థానిక సాగర్ గ్రంథి ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల యజమానులు తప్పనిసరిగా కార్మికులకు మజ్జిగ పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్మికశాఖ జాయింట్ కమిషనర్‌ను కంపెనీ యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కందుకూరు కార్మికశాఖ అధికారి కోటేశ్వరరావు, కంపెనీ మేనేజర్ శ్రీనివాస్, హెచ్‌ఆర్ మేనేజర్ బాబూరావు, శంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు హెల్మెట్ల పంపిణీ

కందుకూరు: ఎండల్లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్స్ కోసం దాతలు హెల్మెట్లు అందజేశారు. స్కందపురి లారీఅసోషియేషన్ అధ్యక్షుడు జి.శ్రీను, ప్రధాన కార్యదర్శి ఎం.గోపి, శ్రీరామా ఎంటర్‌ప్రైజస్ యజమాని నవీన్‌క్రిష్ణలు పట్టణంలోని కానిస్టేబుల్స్‌కి హెల్మెట్లు అందజేశారు. ట్రాఫిక్ ఎస్సై ఎడ్వర్డ్ మాట్లాడుతూ ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి క్షేత్ర స్థాయిలో పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

డీఎస్పీ రామచంద్ర, సీఐ వెంకట్రావు, పట్టణ ఎస్సై హనీఫ్ సూచనలతో దాతల సాయం తీసుకుని ట్రాఫిక్ సిబ్బందికి హెల్మెట్లు అందజేస్తామన్నారు.



ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌కి హెల్మెట్లు అందజేస్తున్న దృశ్యం

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

లింగసముద్రం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను కందుకూరు సెబ్ ఎస్సై మౌలాలి శుక్రవారం తెల్లవారుజామున పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మండలంలోని అన్నెబోయినపల్లె వద్ద ఉన్న మన్నేరు నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం తెలియడంతో మూడు ట్రాక్టర్లను పట్టుకుని, డ్రైవర్లను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు చెప్పారు.

బీవీ రమణకు ఆపద్బాంధవ పురస్కారం

కందుకూరు అర్బన్: పట్టణానికి చెందిన అమ్మ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు డాక్టర్ బీవీ రమణ ఆపద్బాంధవ సేవా రత్న పురస్కారం అందుకున్నారు. శుక్రవారం ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డు ఫంక్షన్ వేడుకలో సంస్థ నిర్వాహకులు రమణకు ఈ అవార్డును ప్రదానం చేశారు. కరోనా సమయంలో పేదవారికి, మున్సిపల్ కార్మికులకు, నిత్యావసరాలు అందించినందుకు, ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు సహాయ సహకారాలు అందించడంతో ఈ అవార్డు వచ్చిందని రమణ తెలిపారు.

బైక్.. కారు ఢీ

- ముగ్గురికి తీవ్ర గాయాలు

పీసీపల్లి: బైక్-కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం అర్ధరాత్రి మండల పరిధిలోని పీసీపల్లి నుంచి పెదవరిమడుగుకు వెళ్తున్న బైక్‌ను కారు ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అదే దారిలో శంకరాపురం నుంచి డయాలసిస్ పేషెంట్‌ను పీసీపల్లి 108 ద్వారా కనిగిరికి తీసుకెళ్తుండగా క్షతగాత్రులను ఈఎంటీ హరినారాయణ, పైలట్ మహేష్‌లు గమనించి ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం క్షతగాత్రుల కోరిక మేరకు కనిగిరిలో సంజీవని హాస్పిటల్‌కు తరలించారు. మండలం ఏరువారిపల్లికి చెందిన ప్రతాప్, చినబాబు, గీతిక ఉన్నారు.

రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలి

కందుకూరు రూరల్: సచివాలయ సిబ్బంది రిజిస్టర్లు, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ సీతారామయ్య అన్నారు. కొండముడుచుపాలెం, మోపాడులోని సచివాలయాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంక్షేమ పథకాలు, సేవలును సకాలంలో అందించేలా కృషి చేయాలన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు ముఖ్యం

లింగసముద్రం: సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని తహసీల్దార్ సుధాకరరావు సూచించారు. శుక్రవారం లింగసముద్రం సచివాలయం 1 మరియు 2 సచివాలయాలను ఎంపీడీఓ శేషబాబుతో కలిసి తనిఖీ చేశారు.

రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రజావిజ్ఞప్తులను స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పారు.